సాక్షి కామారెడ్డి

బుధవారం । 9 । జూలై । 2025



అందరికంటే గొప్పోళ్లు

అందరికంటే గొప్పోళ్లు రైతన్నలే అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఆయన లక్ష్మీదేవునిపల్లిలో పర్యటించారు.

- 8లో ▸



మాయమైన మంకీ ఫుడ్‌కోర్టులు

కోతులు గ్రామాలలోకి రాకుండా చూసేందుకు ఏర్పాటు చేసిన మంకీ ఫుడ్ కోర్టులు.. పట్టించుకునేవారు లేక ఆనవాళ్లు కోల్పోయాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.5 /22.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'



కామారెడ్డి టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి సూచించారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవ సహాయకుల శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం, మానవ హక్కుల పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, న్యాయ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జ్ఞానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఆర్డీవో వీణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'భూభారతికి 8,018 దరఖాస్తులు'



బాన్సువాడ : భూభారతి రెవెన్యూ సదస్సులలో బాన్సువాడ సబ్ డివిజన్‌లో 8,018 దరఖాస్తులు వచ్చాయని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. మంగళవారం ఆమె తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ మండలంలో 686 దరఖాస్తులు రాగా బిచ్కుంద మండలంలో 1,176, బీర్కూర్ మండలంలో 328, డోంగ్లీలో 97, జుక్కల్‌లో 565, మద్నూర్‌లో 771, మహ్మద్‌నగర్‌లో 1,401 దరఖాస్తులు, నస్రుల్లాబాద్ మండలంలో 821, నిజాంసాగర్‌లో 1,195, పెద్దకొడప్‌గల్‌లో 499, పిట్లంలో 479 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిని పరిశీలించి, పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎర్రం చంద్రశేఖర్



కామారెడ్డి అర్బన్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన ఎర్రం చంద్రశేఖర్ నియామకమయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర సెంట్రల్ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలు, ప్రతినిధులు పబ్బ చంద్రశేఖర్, నారాయణ, రవికుమార్, పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి'



నాగిరెడ్డిపేట: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక పురోగతి సాధించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేటలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబురాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ఆర్థిక అంశాలతోపాటు సామాజిక అంశాలపైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులందరికీ రక్త పరీక్షలు చేయించాలన్నారు. దీంతోపాటు జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గతేడాది ఆరు మాసాలకు సంబంధించి రుణాల వడ్డీ డబ్బులను చెల్లిస్తుందన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంతోపాటు ఉపాధి హామీ కార్యాలయం వద్ద సెర్ప్, ఈజీఎస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరచారి, ఏపీఎం జగదీశ్ కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, కార్యదర్శి మంజుల, కోశాధికారి లక్ష్మి, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ స్థానాల లెక్క తేలింది!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల లెక్క తేల్చింది. జిల్లాలో 25 మండలాల పరిధిలో 233 ఎంపీటీసీ స్థానాలున్నాయి. బిచ్కుంద మున్సిపాలిటీగా మారడంతో గతంతో పోల్చితే నాలుగు స్థానాలు తగ్గాయి.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- జిల్లాలో 233 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు
- బిచ్కుంద బల్దియాగా మారడంతో తగ్గిన నాలుగు స్థానాలు
- ఎన్నికల దిశగా అడుగులు పడుతుండడంతో ఆశావహుల్లో ఉత్సాహం

మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండేలా సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఐదుకంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాలే ఉన్నాయి. దీంతో అధికారులకు ఏ ఇబ్బందీ లేకుండాపోయింది. గతంలో జిల్లాలో 25 మండలాల్లో కలిపి 237 ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. బిచ్కుంద మున్సిపాలిటీగా మారడంతో దాని పరిధిలోని నాలుగు ఎంపీటీసీ స్థానాలు తగ్గిపోయాయి. దీంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 233కు తగ్గింది. జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రాదేశిక స్థానాల లెక్క తేలిపోయింది. వీటిలో ఇంకే మార్పులూ ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. బిచ్కుంద ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన డ్రాఫ్ట్ కూడా రిలీజ్ అయ్యింది. ఈ నెల 12న తుది జాబితా ప్రకటించి దాని ఆధారంగా ఎన్నికలకు వెళతారని తెలుస్తోంది. పంచాయతీలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలకు అన్ని రెడీగా ఉన్నాయి. మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని సిద్ధంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం ముందు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక ప్రాదేశిక స్థానాల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తుందా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. గతంలో పంచాయతీ ఎన్నికలు ముందుగా జరిగాయి. ఈసారి ఎలా నిర్వహిస్తారన్న దానికోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

తేలాల్సింది రిజర్వేషన్లే...

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ బీసీ డిక్లరేషన్‌లో పేర్కొంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయితే కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రిజర్వేషన్ల అంశం పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపుదలపై చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుని ఎన్నికలకు వెళ్లేందుకు రెడీ అవుతోంది. రిజర్వేషన్ల లెక్క తేలితే స్థానిక సంస్థల రిజర్వేషన్లకు అడుగులు పడుతాయి. ఏ వర్గానికి ఎంత రిజర్వేషన్ వర్తింపజేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎన్నికలు వాయిదా పడుతూ స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. మూడు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు అడుగులు వేస్తోంది. అయితే రిజర్వేషన్ల అంశం తేలితేనే ఎన్నికలకు లైన్ క్లియర్ అవుతుందని భావిస్తున్నారు.

ఆశగా ఎదురుచూపులు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న వారంతా ఎన్నికలకు అడుగులు పడుతుండడంతో అప్రమత్తమయ్యారు. ఎంపీటీసీలుగా గెలుపొంది ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు పొందాలని, అలాగే జెడ్పీటీసీగా పోటీ చేయాలని ఎంతో మంది ఆశిస్తున్నారు. గతంలో రిజర్వేషన్లు, ప్రస్తుత జనాభా, ఓటర్ల లెక్కలు బేరీజు వేసుకుంటూ తమకు రిజర్వేషన్లు అనుకూలంగా వస్తాయా లేదా అన్నదానిపై సన్నిహితులతో చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నికల సమయంలో రెండు పర్యాయాలు రిజర్వేషన్లు కొనసాగేలా చట్టం చేశారు. ఇప్పుడు అదే చట్టం ప్రకారం ఎన్నికలు కొనసాగుతాయా, లేక రిజర్వేషన్లు మారుస్తారా అన్నదీ తేలాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్న వారు అలాగే కొనసాగాలని కోరుకుంటుండగా, అనుకూలంగా లేని వారు రిజర్వేషన్లు మారితే బాగుండని భావిస్తున్నారు.

మంత్రి ఆదేశాలను అమలు చేయాలి

- సబ్‌స్టేషన్లు, ట్రామాకేర్ సెంటర్ కోసం ప్రతిపాదనలు పంపండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల అమలుపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఆయా అంశాలను పక్షం రోజుల్లో కార్యాచరణలోకి తీసుకురావాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం జిల్లాలో అదనంగా అవసరమైన సబ్‌స్టేషన్ల మంజూరు కోసం ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఎస్ఈ శ్రావణ్‌కుమార్‌ను ఆదేశించారు. జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈకి సూచించారు. జుక్కల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు, ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అటవీ భూములలో 159 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టాల ప్రకారం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్‌కు సూచించారు. పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాలలో అధికారులు జొన్న పంట వివరాలను వాస్తవానికి విరుద్ధంగా నమోదు చేశారని, తద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతాయని ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఏవో తిరుమల ప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థి అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

కామారెడ్డి అర్బన్: మహిళా సంఘాలకు సంబంధించిన బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కామారెడ్డిలో నిర్వహించిన మండల ఇందిర మహిళా శక్తి ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతగల మహిళలందరిని మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చందర్, డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, డీపీఎం(ఫైనాన్స్) రాజయ్య, ఎంపీడీవో ఎఫ్సిబా, ఏపీఎం మోహిజ్, సీసీలు విశ్వనాథం, అంజగౌడ్, స్వరూప, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

జై అమర్‌నాథ్..



అమర్‌నాథ్ యాత్రలో ఇందూరు జిల్లా బృందం

- సైన్యం మీద అపారమైన నమ్మకంతో కశ్మీర్ యాత్రకు జిల్లా వాసులు
- మంచులింగాన్ని దర్శించుకున్న యాత్రికులు
- పహల్గామ్ ఘటనతో బెదిరేది లేదంటున్న శివయ్య భక్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: భూతల స్వర్గంగా పేరు పొందిన కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మన పర్యాటకులపై దాయాది దేశం ఉగ్రమూకలు దాడికి పాల్పడితే భారత ప్రభుత్వం, సైన్యం స్పందించిన తీరుపై యావత్ దేశం గర్వంతో ఉప్పొంగింది. భారత ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలిచారు. పహల్గామ్ మారణహోమం తమను ఏమాత్రం భయపెట్టలేదని ప్రపంచానికి చాటిచెబుతున్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత పర్యాటక రంగ అభివృద్ధితో ఆర్థికంగా స్వావలంబన సాధిస్తున్న కశ్మీర్‌లో ఆధ్యాత్మిక, సాధారణ పర్యాటకానికి దన్నుగా నిలబడుతున్నారు. ఇందూరు జిల్లా వాసులు సైతం కశ్మీర్ పర్యటకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా నుంచి అమర్‌నాథ్ యాత్ర, కశ్మీర్ యాత్ర కోసం ఇప్పటి వరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి 124 మంది మెడికల్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఇంకా మరికొందరు ఈ సర్టిఫికెట్లు తీసుకునే పనిలో ఉన్నారు. జిల్లా నుంచి పలువురు బృందాలుగా వెళుతున్నారు. మరోవైపు సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో యాత్ర మార్గంలో అన్నదానం చేస్తున్నారు. ఈ అమర్‌నాథ్ సేవాసమితిలో నిజామాబాద్ జిల్లా వాసులు సభ్యులుగా ఉన్నారు.

బలగాలు గైడ్ చేస్తున్నాయి



అమర్‌నాథ్ యాత్రలో భారత సైనికులు చక్కగా గైడ్ చేస్తున్నారు. మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నారు. ఇబ్బందులేమైనా ఉంటే అడుగుతున్నారు. కశ్మీర్‌లో చాలా చోట్ల రోడ్లు, వంతెనల నిర్మాణాలు తుది దశకు వచ్చాయి. టన్నెల్స్ సైతం ప్రారంభమయ్యాయి. తెలుగు వారు చాలామంది ఉన్నారు. మేము పదిమంది బృందంగా నిజామాబాద్ నుంచి వెళ్లాం. శ్రీనగర్‌లో దాల్ సరస్సు చాలా బాగుంది. వంతెనలు, రోడ్లు పూర్తి అయితే మరింత తక్కువ సమయంలో యాత్ర పూర్తి చేయొచ్చు.

– వడ్డి జనార్దన్ రెడ్డి, వరలక్ష్మి, నవీపేట

మొదటిసారి యాత్రకు..



ప్రతిఏటా అయ్యప్ప మాల వేస్తున్న ఎనిమిది మంది బృందంతో కలిసి మొదటిసారి అమర్‌నాథ్ యాత్రకు వందేభారత్ రైలులో వెళుతున్నాం. ఇప్పటి వరకు మా బృందం నాలుగు సార్లు శబరిమలకు పాదయాత్ర చేసింది. గత ఏడాది కాశీ నుంచి శబరిమల, రామేశ్వరం వరకు పాదయాత్ర చేశాం. 30 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్నా. మొదటిసారి ఈ నెల 16న అమర్‌నాథ్ యాత్రకు వెళుతుండడం సంతోషంగా ఉంది. మానస సరోవరం యాత్రకు కూడా వెళుతున్నాం.

– ధాత్రిక రతన్, నిజామాబాద్

అమర్‌నాథ్ యాత్రను ఎప్పటికీ మరిచిపోలేము




అమర్‌నాథ్ యాత్రలో భాగంగా కశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయాన్ని కూడా దర్శించుకున్నాం. పహల్గామ్ దాడి తరువాత భారత ప్రజలు భయపడకుండా అమర్‌నాథ్ యాత్రకు తరలివస్తున్నారు. భారత ప్రభుత్వం, భారత సైన్యం మీద ఉన్న అపార విశ్వాసానికి ఇది నిదర్శనం. యాత్ర కోసం భారత ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు, కల్పించిన భద్రత అత్యద్భుతంగా ఉన్నాయి. అమర్‌నాథ్ యాత్ర పొడవునా సైన్యం అడుగడుగునా పహారా కాస్తోంది. దీంతో ఏమాత్రం భయం లేకుండా ప్రశాంతంగా యాత్ర చేయొచ్చు. భయం అనేదే లేకుండా యాత్ర చేమొచ్చు. కశ్మీర్ అందాలు చాలా అద్భుతంగా ఉన్నాయి. ప్రకృతి అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రకృతి కూడా ప్రస్తుతం పూర్తి అనుకూలంగా ఉంది. జూలై, ఆగస్టులో సందర్శిస్తే అద్భుతంగా ఉంటుంది. అమర్‌నాథ్ యాత్రలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఉచితంగా అందిస్తున్నారు. దక్షిణ భారత, తెలుగు లంగర్లు చాలా ఉన్నాయి.

– కరుటూరి పాపారావు, వెంకట సుబ్బలక్ష్మి, జైతాపూర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నాం
- రోడ్లపై గుంతల మరమ్మతులకు నిధులు కేటాయించాం
- డ్రెయినేజీలపై ఆక్రమణలను సీరియస్‌గా తీసుకుంటాం
- పట్టణ సమస్యలను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి ధన్యవాదాలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ



కామారెడ్డి టౌన్: పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మురికి కాలువల ఆక్రమణలను సీరియస్‌గా తీసుకుంటామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నామని, వర్షాకాలంలో పట్టణవాసులు ఇబ్బందులకు గురికాకుండా రోడ్లపై గుంతల మరమ్మతులకు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. కామారెడ్డి బల్దియా పరిధిలోని సమస్యలపై 'సాక్షి' వరుసగా కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం 'సాక్షి' మున్సిపల్ కమిషనర్‌ను ఇంటర్వ్యూ చేసింది. పట్టణంలోని ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన 'సాక్షి'కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్వ్యూ వివరాలు..

రోడ్ల మరమ్మతులకు నిధులు..

పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు కలెక్టర్ అనుమతితో రూ. 10 లక్షలు కేటాయిస్తున్నాం. పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. అశోక్‌నగర్ ప్రధాన రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

వీధి దీపాల కోసం..

వీధి దీపాల నిర్వహణ కాంట్రాక్టర్ నుంచి సమస్య ఉంది. కాంట్రాక్టర్‌కు రూ. 4 కోట్ల బకాయిలుంటే ఇటీవల రూ. కోటి చెల్లించాం. వీధి దీపాల కొనుగోలుకు అత్యవసరంగా రూ. 10 లక్షలను కలెక్టర్ ఆదేశాలతో కేటాయించాం. అత్యవసరం అయిన చోట ముందుగా లైట్లను బిగిస్తాం. విద్యుత్ బిల్లులు నెలకు రూ. 40 లక్షలు వస్తుండడంతో బల్దియాకు ఆర్థిక భారమవుతోంది.

నీటి సమస్య లేకుండా చూస్తున్నాం

పట్టణంలో వేసవి సీజన్‌లో ప్రణాళికబద్ధంగా ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేసి సమస్యను అధిగమించాం. ప్రస్తుతం నీటి సమస్య రెండు మూడు కాలనీలలో మాత్రమే ఉంది. అమృత్‌జల్ పథకంలో రూ. 93 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయితే సమస్య తీరనుంది.

2 లక్షల మొక్కలు నాటుతాం

వన మహోత్సవంలో భాగంగా పట్టణంలో 2 లక్షల మొక్కలను నాటాలన్నది లక్ష్యం. ప్రతి ఇంటికి మొక్కలను సరఫరా చేస్తాం. మున్సిపల్ ఖాళీ స్థలాలు, ప్రకృతి వనాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటుతాం. సీజనల్ వ్యాధుల నివారణ కోసం మురికి కాలువలు, గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తాం. వార్డులలో ఫాగింగ్ చేస్తున్నాం. ప్రైవేట్ ఓపెన్ స్థలాల శుభ్రత కోసం యజమానులకు నోటీసులను జారీ చేస్తాం. మున్సిపల్ ఓపెన్ స్థలాల పరిరక్షణ కోసం ఎల్ఆర్ఎస్ నిధులు నుంచి హెచ్చరిక బోర్డులు, కంచెలను ఏర్పాటు చేస్తాం.

నోటీసులిస్తాం

సెల్లార్‌లను వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకోవాలి. వాటిలో దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్యను అధిగమించాలంటే యజమానులూ సహకరించాలి. నిజాంసాగర్ చౌరస్తాలో జంక్షన్ విస్తరణ ఆటంకాల సమస్య కొలిక్కి వచ్చింది. త్వరలో పనులు చేపడుతాం.

ఆక్రమణలను తొలగిస్తాం..

పట్టణంలో మురికి కాలువలపై స్లాబ్ వేయడం, ఆక్రమణలు చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. 'సాక్షి'లో కథనం వచ్చిన మరుసటి రోజే టౌన్‌ప్లానింగ్ అధికారులతో దీనిపై సమీక్షించా. కాలువలపై స్లాబ్‌లను కూల్చివేయడానికి నూతన బ్రేకర్‌ను కొనుగోలు చేసాం. కార్మికుడు శుభ్రం చేయకుండా వీలులేకుండా ఉన్న మురికి కాలువలపై ఆక్రమణలను తొలగిస్తాం. వ్యాపారులు, ఇంటి యజమానులు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకుని సహకరించాలి.

సానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్నాం..

పట్టణంలో జనాభా నిష్పత్తి కంటే పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువగానే ఉన్నారు. నిత్యం కొందరు గైర్హాజరవుతుండడంతో సమస్య ఏర్పడుతోంది. అయినా అన్ని వార్డులో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా పనులు చేయిస్తున్నాం. అక్కడక్కడ పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో కాస్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరలో టెండర్లు నిర్వహించి మురికి కాలువలు, రోడ్ల నిర్మాణాలు చేపడతాం. ఇంటింటా చెత్త సేకరణ చేసే ఆటోలు, చెత్తను డంపింగ్ చేసే ఆటోల మరమ్మతులు, సర్వీసింగ్ కోసం డీఆర్‌సీ వద్ద ప్రత్యేక షెడ్డు వేశాం. చెడిపోయిన తక్షణమే వాహనాలకు మరమ్మతులు చేయిస్తాం. డంపింగ్ యార్డు వద్ద వర్మికంపోస్టు పనులు ప్రారంభం కాగానే తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తాం. వార్డుల్లో సానిటేషన్ సమస్యలుంటే నేరుగా నాకు ఫోన్ చేసినా స్పందిస్తా. భారీ కాలువల లోంచి పూడిక తీసేందుకు రూ. 5 లక్షలు కేటాయించాం. వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ఈ పనులను పూర్తి చేస్తాం.

వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా వాల్యా

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



బి. వాల్యా



పెరుగు వెంకటేశ్వర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా బి.వాల్యా నియమితులయ్యారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా పెరుగు వెంకటేశ్వర్లును నియమించారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్(డీఎంఈ), రాష్ట్ర హెల్త్ సెక్రెటరీ క్రిస్టీనా జెడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ వాల్యా గాంధీ మెడికల్ కళాశాలలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మహేశ్వరం మెడికల్ కళాశాలలో జనరల్ సర్జన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రభుత్వం ప్రమోషన్ కల్పించి, కామారెడ్డికి బదిలీ చేసింది. ఇప్పటి వరకు కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ శివప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఫరీదా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రారంభం నుంచి ఇన్‌చార్జీల పాలనే..

కామారెడ్డి మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లు ప్రారంభం అయిన నాటి నుంచి ఇన్‌చార్జీల పాలనే కొనసాగింది. జీజీహెచ్ ఇన్‌చార్జీల పాలనలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు వచ్చాయి. వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. పూర్తి స్థాయి ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ వస్తుండడంతో వైద్యశాల, జీజీహెచ్‌లలో సమస్యలు పరిష్కారం అవుతాయని, పాలన గాడిలో పడుతుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

సెక్రెటరీగా ఎన్నిక


అనిల్

ఎల్లారెడ్డిరూరల్: ఈ–పంచాయతీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో ఈ–పంచాయతీ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనిల్ రాష్ట్ర కార్యవర్గంలో పదవి లభించడం సంతోషకరమని అన్నారు. అభినందనలు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా గంగాధర్



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా(ఎస్‌ఆర్‌ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఇందూరు గంగాధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి కొత్త ప్రిన్సిపల్‌కు బాధ్యతలు అప్పగించారు. అంతకు ముందు రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కొత్త ప్రిన్సిపల్ గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. కళాశాలకు మరింత మంచి పేరు తేవడానికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

అభినందనలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గాదె తిరుపతిని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మంగళవారం అభినందించారు. మండల అధ్యక్షుడిగా తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరమని అన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు.

బాధ్యతల స్వీకరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా మధుసూదన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో లింగంపేటలో విధులు నిర్వహించిన ఏఎస్సై ప్రకాష్ నాయక్ బదిలీపై గాంధారి మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వహించిన మధుసూదన్ బదిలీపై లింగంపేటకు వచ్చారు.

నాణ్యమైన భోజనం అందించాలి



దోమకొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్ల నిర్వహణ పరిశుభ్రంగా ఉంచాలని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆ తర్వాత ఇందిరా మహిళా శక్తి పనితీరుపై వీవోలతో సమావేశంలో చర్చించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

9 నుంచి పంచకర్మ ఉచిత చికిత్స శిబిరం

కామారెడ్డి అర్బన్: స్థానిక సుభాష్ టాకీస్ సమీపంలోని సంకల్ప ఆయుర్వేద ఆస్పత్రిలో ఈనెల 9 నుంచి 13 వరకు ఉచిత పంచకర్మ చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు మృత్యుంజయ వెన్నెల తెలిపారు. శిబిరంలో ప్రతిరోజు 20 మందికి చికిత్సలు చేయనున్నందున ముందుగా 99491 57912 నంబర్‌కు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

10న జైగురు దత్త ఆశ్రమంలో గురుపౌర్ణమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న స్థానిక జైగురు దత్త ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎస్ ట్రస్టు ప్రతినిధి బి.సీతారామారావు తెలిపారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలుంటాయని ఆయన పేర్కొన్నారు.

కొద్దిపాటి జలం.. రోజువారీ ఆదాయం

- మల్చింగ్ విధానంలో టమాట సాగు
- మంచి దిగుబడి సాధిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న రైతు రాంరెడ్డి


సదాశివనగర్‌లో సాగు చేసిన టమాట పంటను చూపిస్తున్న రైతు రాంరెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ కొద్దిపాటి నీటితో పంటలు పండిస్తు ఆదర్శంగా నిలుస్తున్నాడు సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన నల్ల రాంరెడ్డి అనే రైతు. వినూత్నమైన ఆలోచన చేసి సాగులో కొత్త విధానాన్ని చేపడుతున్నాడు. ప్రతి సంవత్సరం చెరుకు పంట సాగు చేసేవాడు. చెరుకు సంవత్సర పంట కావడంతో కొంత ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం చెరుకుతో పాటు ఎకరం భూమిలో టమాటను సాగు చేశారు. మల్చింగ్ విధానంలో టమాట పంటను సాగు చేయడం వల్ల పంట దిగుబడి వస్తుందని రైతు పేర్కొంటున్నాడు. గతంలో చెరుకు పంట సాగు చేసి చెరుకు మధ్యలో గల గెరలలో టమాట సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు సాధించినట్లు తెలిపారు. ఆ ఆలోచనతోనే ప్రస్తుతం ప్రత్యేకంగా ఎకరం భూమిలో మల్చింగ్ విధానాన్ని పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

మహారాష్ట్ర నుంచి వెదురు కర్రలు..

టమాట సాగులో టమాట నేలపై వాలకుండా ఉండేందుకు వెదురు కర్రలను మహారాష్ట్ర నుంచి తెప్పించి పందిరి విధానంలో ఏర్పాటు చేశాడు. పెరిగిన మొక్కలను తీగలకు వేలాడదీస్తుండటంతో టమాట నేలపై వాలకుండా ఉంటుంది. దీంతో టమాట పాడుకాకుండా ఉంటుందని రైతు పేర్కొంటున్నాడు. ప్రస్తుతం రోజుకు 20 బాక్స్‌లు దిగుబడి సాధిస్తున్నాడు. మంచి పంట దిగుబడి వస్తున్నప్పటికి మార్కెట్‌లో అనుకూలమైన ధర లేక పోవడంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొంటున్నారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి టమాట మొక్కలు

టమాట సాగు చేసేదుకు ఛత్తీస్‌గఢ్ నుంచి టమాట నారు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో పంట సాగు విధానానికి పూనుకున్నాడు. మొక్కలు నాటి వాటికి ప్లాస్టిక్ కవర్‌ను నేలపై పరిచి ఆ కవర్‌కు మొక్క నాటిన చోట రంధ్రం చేసి కవర్‌ను పరిచాడు. కవర్ కింద డ్రిప్ పైప్‌ను అమర్చాడు. దీంతో మొక్కకు అవసమైన నీరు అందుతుందన్నారు. అదే డ్రిప్ పైప్‌ల ద్వారా ఎరువులను కలిపి అందిస్తున్నారు. మల్చింగ్ విధానంతో పిచ్చి మొక్కల బెడద ఉండదన్నారు.

ధర కాస్త తక్కువగా ఉంది

మల్చింగ్ విధానంలో టమాట సాగు చేయడం ఇదే మొదటి సారి. ఎకరం భూమిలో కేవలం టమాట సాగు చేయాలని నిర్ణయం తీసుకున్నాను. ఇప్పటికి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. రోజుకు 20 బాక్స్‌ల టమాటలు కాస్తున్నాయి. పంట దిగుబడికి అనుకూలంగా ధర ఉంటే ఇంకా అధిక మొత్తంలో లాభాలను ఆర్జించవచ్చు.

–నల్ల రాంరెడ్డి, టమాట రైతు, సదాశివనగర్

దత్తత తీసుకోబడిన గ్రామమే దత్తాపూర్


దత్తాపూర్ ముఖ చిత్రం

మీకు తెలుసా?

డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామాన్ని దేశ్‌ముఖ్ అనే దొర దత్తత తీసుకొని పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే ఈ గ్రామానికి దత్తాపూర్ అనే పేరు వచ్చినట్లు ఊరి పెద్దలు చెప్తున్నారు. సుమారు 200 ఏళ్ల క్రితం లంబాడీ తండా మాత్రమే ఉండేదని, కాలక్రమేనా గ్రామంగా అవతరించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

- తొండాకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోనే ఉన్న దత్తాపూర్ 1981లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం 900 ఎకరాల వరకు సాగు భూములు, 395 నివాస గృహాలున్నాయి.
- మొదట్లో తండా ఉండటంతో ఊరిలో లంబాడీ(గిరిజన) కుటుంబాలు 100కు పైగా ఉన్నాయి. అందుకే ఈ ఊరికి మొదటి సర్పంచ్‌గా మూడ్ రామ్‌జీ 1981లో ఎన్నికయ్యారు. 1959లో గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటైంది.
- గ్రామానికి రెండు చెరువులున్నాయి. ఒకటి పెద్ద చెరువు, మరొకటి గ్రామకుంట. పెద్ద చెరువు విస్తీర్ణం 106ఎకరాలు ఉంటుంది. ఉమ్మడి నందిపేట్ మండలంలో కుద్వాన్‌పూర్ చెరువు తర్వాత దత్తాపూర్ పెద్ద చెరువుదే అతి పెద్ద విస్తీర్ణం.
- దత్తాపూర్‌లో దత్తాత్రేయుడికి ఊరంతా భక్తులే. వందేళ్ల క్రితమే శివదత్త గుడిని కట్టారు. అప్పటి నుంచే పూజలు, భజనలు చేస్తున్నారు. ఏటా దత్త జయంతి రోజున (పౌర్ణమి) పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇక్కడ ఉన్న ఔదుంబర వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి నిష్టతో దత్తుడిని పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల్లో నమ్మకం ఏర్పడింది.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

అందరి కంటే గొప్పోళ్లు రైతన్నలు

ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న


బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న గోరటి వెంకన్న


లక్ష్మీదేవునిపల్లిలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను సన్మానిస్తున్న వృద్ధుల సంఘం ప్రతినిధులు

భిక్కనూరు: కొత్తవి ఎన్ని వచ్చినా రైతన్నలకు మించిన వారు ఎవ్వరూ ఉండరని ప్రపంచంలో అందరి కంటే గొప్పోళ్ల రైతన్నలని వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. లక్ష్మీదేవునిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు తన తండ్రి ఎల్లయ్య పేరిట నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడాలని, తర్వాత అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. నీడను నీళ్లను ఇచ్చిన వారిని ఎన్నటికీ మరిచిపోరన్నారు. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పటి నేతలు అందరూ ఒకరిని ఒకరూ గౌరవించుకునేవారన్నారు. వాజ్‌పేయ్, నీలం సంజీవరెడ్డి, వైఎస్సార్‌లు తాము అధికారంలో ఉన్నప్పటికి ప్రతిపక్ష పార్టీల నేతలను గౌరవించారని పలు సందర్భాలను ఉదహరించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్నను వృద్ధుల సంఘం ప్రతినిధులు సన్మానించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో నక్క సంచారం


భిక్కనూరులో పాత గ్రంథాలయం వీధిలో తిరుగుతున్న నక్క

భిక్కనూరు: మండల కేంద్రంలో మంగళవారం ఓ నక్క సంచరించింది. సుభాష్‌గల్లి, అంబేడ్కర్ వీధి, పాత గ్రంథాలయం, పోస్టాఫీస్ వీధుల్లో పరుగులు తీయడంతో ప్రజలు భయపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు వీధులలో సంచరించింది. దీంతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రోబోటిక్స్‌పై సోహం అకాడమీ, ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 50 మంది విద్యార్థులు శిక్షణ పొందగా ప్రతిభ చూపి 20 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు సోహం అకాడమీ ప్రతినిధులు వర్షిత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నోటు బుక్కులు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో షౌకత్ అలీ నోటు బుక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 51 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మొదటి సారి ప్రభుత్వం నోటు బుక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నాగిరెడ్డిపేట పీఎస్‌కు ఇద్దరు ఏఎస్సైల నియామకం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు ఇద్దరు ఏఎస్సైలను నియమించినట్లు స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైలు మధుసూదన్, శంకరయ్యను నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారని ఆయన చెప్పారు. మంగళవారం వారు విధుల్లో చేరారు.

ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా

రెండు గ్రామాల్లో బ్రేకర్‌ల ప్రారంభం


యాడారంలో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రవణ్‌కుమార్

బీబీపేట: వ్యవసాయంతో పాటు ఇళ్లలో కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం యాడారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సబ్‌స్టేషన్‌లో గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఒక బ్రేకర్‌ను, వ్యవసాయ కనెక్షన్‌లకు ఒకటి ఉండేలా బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లయితే విద్యుత్ శాఖ నుంచే రవాణా ఉచితంగానే చేస్తామని, మరమ్మతులు కూడా ఉచితంగానే చేస్తున్నామని తెలిపారు. డీఈ కల్యాణ్ చక్రవర్తి, ఏఈ విజయభాస్కర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డే బస్ షెల్టర్..!


రోడ్డు పక్కన నిల్చున్న ప్రయాణికులు

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తోంది. గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను కూల్చి దాని స్థలంలో టాయిలెట్లు నిర్మించారు. రాజన్న సిరిసిల్లా, సిద్దిపేట జిల్లాల కూడలి అయిన చౌరస్తా మీదుగా ప్రతి రోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తూ పోతుంటారు. మూడు జిల్లాల సరిహద్దులో ఉన్న చౌరస్తాలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నానా అగచాట్లకు గురవుతున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోయారు. అధికారులు స్పందించి గజ్యానాయక్ తండాలో చౌరస్తా బస్ షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.

కార్యకర్తలకు బీజేపీ అండ


ఆర్థిక సాయం చేస్తున్న బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి: కార్యకర్తలకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం మల్కాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు ఇంటిని అధికారులు కూల్చి వేయడంతో ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. ఈసందర్భంగా పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. దళిత నాయకుడి ఇంటిపై అధికారులు పోలీసు బలగాలతో వచ్చి ఇంటిని కూల్చి వేయడం సరికాదన్నారు. కావాలనే కక్ష పూరితంగా ఇంటిని కూల్చి వేశారని ఆరోపించారు. ఎల్లారెడ్డి మండలంలో అక్రమంగా నిర్మించిన ఎన్ని ఇళ్లను అధికారులు కూల్చి వేశారో చెప్పాలని సవాల్ విసిరారు. బీజేపీ నాయకులపై దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నాయకులు నక్క గంగాధర్, రాజేష్, కాశీనాథ్, కిష్టయ్య, లింగారావు, బాలకిషన్ తదితరులున్నారు.

వడ్డీ రాయితీ కింద జిల్లాకు రూ.19.38 కోట్లు


తాండూర్ శివారులో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను అందించాలనే ఉద్దేశంతో వడ్డీరాయితీ కింద జిల్లాకు రూ.19.38 కోట్లు మంజూరైనట్లు డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకు ఏర్పాటుకు మాల్తుమ్మెద శివారులో, సోలార్‌ప్లాంటు ఏర్పాటుకు తాండూరు శివారులో ఎంపిక చేసిన స్థలాలను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడ్డీ రాయితీ డబ్బులను ఈ నెల 12 నుంచి 18 వరకు మహిళాసంఘాల ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు. దీంతోపాటు పిట్లం మండలంలోని అల్లాపూర్‌లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే నస్రుల్లాబాద్ మండలంలో మండల సమాఖ్యాల ఆధ్వర్యంలో పెట్రోల్‌బంకులను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి, నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఏపీయం జగదీశ్‌కుమార్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ముత్యాల పోశమ్మ బోనాల పండగ


బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

బాన్సువాడ: ఆషాఢ మాసం పురస్కరించుకుని మంగళవారం బాన్సువాడలో ముత్యాల పోశమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. పాత బాన్సువాడ నుంచి మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. కొత్త బాన్సువాడలో ఉన్న ముత్యాల పోశమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బోనం సమర్పించిన ఆగ్రో చైర్మన్ కాసుల


బోనం ఎత్తుకున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల

హైదరాబాద్‌లోని పోచమ్మకు మంగళవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ బోనం సమర్పించారు. ఆషాడ మాసంలో గ్రామ దేవతలకు బోనాలను సమర్పిస్తారని.. అందులో భాగంగా పోచమ్మకు బోనం సమర్పించినట్లు ఆయన తెలిపారు.

పోచారంలో బోనాలు


పోచారంలో బోనాలతో ఎమ్మెల్యే దంపతులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన స్వగ్రామం పోచారంలో నిర్వహించిన ఆషాఢమాస బోనాల పండుగలో సతీ సమేతంగా పాల్గొన్నారు. గ్రామదేవత నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. నాయకులు శంభురెడ్డి, ప్రేమల దంపతులు, విజయ్‌గౌడ్, నరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బోనాలను ఘనంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ముత్యాల పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 20న బోనాల పండగను నిర్వహించాలని నిర్ణయించారు. ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్, తదితరులున్నారు.

ఘనంగా బురుజు మైసమ్మ బోనాలు


శోభాయాత్రలో మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని బురుజు మైసమ్మకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండగను నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించారు.

కాలభైరవుడికి సిందూర పూజలు

రామారెడ్డి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీకాలభైరవుడి ఆలయంలో మంగళవారం స్వామివారికి భక్తులు జలాభిషేకాలు, సిందూర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ప్రభు గుప్తా, అర్చకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పొలం పనులు చేస్తూ ఒకరి మృతి


బస్వయ్య మృతదేహం

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంపునకు చెందిన గెంట్యాల బస్వయ్య (38) మంగళవారం పొలంలో పనిచేస్తూ మృతి చెందాడు. ఉదయం గ్రామానికి చెందిన ధరావత్ జగ్రామ్ పొలంలో వరాలు చేయడానికి కూలీకి వెళ్లాడు. పని చేస్తుండగా కాలు జారి బోర్లా పడటంతో ముఖం బురదలో కూరుకుపోయింది. దీంతో ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఆర్ కాలనీలో దొంగల బీభత్సం

- 16 తులాల బంగారం చోరీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామ పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గురురాఘవేంద్ర కాలనీలో నివాసముండే ప్రభుత్వ ఉద్యోగి దేవరాజు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. తిరిగి సోమవారం వచ్చి చూడగా ఇళ్లంతా గందరగోళంగా ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. బీరువాలో ఉన్న 16 తులాల బంగారు నగలు, రూ.60వేలు చోరీకి గురైనట్లుగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ పుటేజీని పరిశీలించగా ముగ్గురు దుండగులు ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి పక్కాగా చోరీకి పాల్పడినట్లు తెలిసింది.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్ సీఐ బూస శ్రీనివాస్ తెలిపారు. నాగారంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన సాలంకే రత్నదీప్ గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. 15 గ్రాముల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- తప్పిన ప్రాణాపాయం



ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో ముందు ప్రయాణిస్తున్న రెండు కార్లను వెనుక నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి వేగంగా ఢీ కొట్టింది. దీంతో ముందు వెళ్తున్న రెండుకార్లు వరుసగా ఢీకొనడంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ప్రమాదానికి గురైన కారు తగలడంతో బైక్ పై ప్రయాణిస్తున్న కామారెడ్డి జిల్లా ఉత్తునూరు గ్రామానికి చెందిన దంపతులకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడిన వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కాగా, కోతుల గుంపు ఎదురు రావడంతో కార్లను ఆపగా వెనుకాల నుంచి లారీ ఢీకొన్నట్లు పేర్కొన్నారు.

యూరియా కోసం బారులు..



యూరియా కోసం రాళ్లు, కొమ్మలను వరుసలో ఉంచిన రైతులు

రాజంపేట: ఆర్గొండ సొసైటీ పరిధిలోని రైతులు మంగళవారం యూరియా కోసం ఉదయం నుంచే బారులు తీరారు. గంటల తరబడి క్యూలో నిల్చొనే ఓపిక లేక వరుసలో రాళ్లు, చెట్ల కొమ్మలను ఉంచారు. అయితే యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని సొసైటీ చైర్మన్ కంది శివరాములు పేర్కొన్నారు. మంగళవారం 1,005 యూరియా బస్తాలు అందుబాటులో ఉండగా 350 మంది రైతులు అవసరమైనన్ని బస్తాలు తీసుకెళ్లారన్నారు. అందరికీ యూరియా సరఫరా చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు.